క్లుప్తంగా

మంత్రి రోజాకు స్వాగతం



మంత్రి రోజాతో సర్పంచ్ సాయిరవి తదితరులు

నారాయణవనం: టూరిజం శాఖామంత్రి ఆర్కే రోజాకు మండలంలోని పాలమంగళంలో స్వాగతం లభించింది. మంగళవారం మధ్యాహ్నం నింద్ర మండలం సుబ్బానాయుడుకండ్రిగలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనడానికి వెళుతున్న మంత్రిని మండలంలోని పాలమంగళం సచివాలయం వద్ద సర్పంచ్ సాయిరవి, సచివాలయ సిబ్బంది ఆహ్వానించి శాలువలతో సన్మానించారు.

భక్తులకు అన్నదానం



భక్తులకు అన్నదానం చేస్తున్న సీఐ అంజూయాదవ్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం పరిపాలనభవనం వద్ద బ్రహ్మశ్రీ ఓంకార స్వామి జీవ సమాధి మఠం వద్ద మంగళవారం భక్తులకు 1వ పట్టణ సీఐ అంజూయాదవ్ చేతుల మీదుగా అన్నదానం చేశారు. ఆమె మాట్లాడుతూ భక్తులకు సేవ చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

అటెండర్లకు యూనిఫాం పంపిణీ



యూనిఫాం పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

బుచ్చినాయుడుకండ్రిగ: మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న ముగ్గురు అటెండర్లకు మంగళవారం ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆరణివిద్యానాథరెడ్డి యూనిఫాం పంపిణీ చేశారు. రెండు జతల చొప్పున ప్రభుత్వం ఉచితంగా యూనిఫాంను అందజేసిందని ఎంపీడీఓ తెలిపారు.

మోటార్ సైక్లిస్టులకు గాయాలు

ఏర్పేడు: మండలంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపిన వివరాలు.. సూళ్లూరుపేటకు చెందిన ప్రకాష్(32), సుధాకర్(30) ద్విచక్ర వాహనంపై తిరుపతికి వెళుతుండగా సీతారాంపేట సమీపంలో ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి అదుపు తప్పి పడ్డారు. గాయాలపాలైన వారిద్దరినీ చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాల వేలం

పిచ్చాటూరు: అక్రమ రవాణా కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలకు వేసిన వేలంలో రూ.46,900 సమకూరినట్లు ఎస్‌ఈబి సూపరింటెంట్ స్వాతి తెలిపారు. నాగలాపురం పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం వేలం నిర్వహించారు. స్వాతి మాట్లాడుతూ, మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను వేలం వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీ శ్రీనివాసరావు, సత్యవేడు సీఐ విశ్వేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే సాయం



మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఆకర్ష్ రెడ్డి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని ఈదులగుంటకు చెందిన వి.మణి మంగళవారం అనారోగ్యంతో మరణించాడు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి తన కుమారుడు బియ్యపు ఆకర్ష్ రెడ్డి ద్వారా మృతుడి అంత్యక్రియలకు రూ.10 వేలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



ఈ-క్రాప్‌పై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలో వరి పైరు సాగు చేసిన ప్రతి రైతూ భరోసా కేంద్రంలో ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగోలు సురేంద్రరెడ్డి కోరారు. మంగళవారం చిట్టత్తూరులోని రైతులకు ఈ-క్రాప్ నమోదు చేశారు. ఇది నమోదు చేసుకున్న రైతులకు ధాన్యం కొనుగోలు, గిట్టుబాటు ధర, పంటల బీమా, సున్నా వడ్డీ పథకాలు వర్తిస్తాయని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది అహంతి, రైతులు పాల్గొన్నారు.

సంక్షేమమే జగనన్న ఎజెండా

- ప్రతి కుటుంబానికీ రూ.4 లక్షల లబ్ధి
- సమస్యలపై ఎమ్మెల్యే వినతుల స్వీకరణ
- గడప గడపలో ఘనస్వాగతం
- అధికారులతో ఆదిమూలం సమీక్ష
- హౌసింగ్ అధికారులపై మండిపాటు
- నివేదిక ఇవ్వాలని ఆదేశం
- సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం



లబ్ధిదారులు పొందిన లబ్ధిని సంక్షేమ బుక్‌లెట్లతో వివరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం : సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎజెండా అని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మండలంలోని కోటమంగాపురంలో మంగళవారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి కుటుంబాన్ని కలిశారు. మూడేళ్ల కాలంలో ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

అనంతరం స్థానిక సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సమస్యలపై ప్రజల నుంచి ఎమ్మెల్యే వినతులను స్వీకరించారు. ప్రధానంగా మురుగు కాలువలు నిర్మించాలని, కరెంట్ సౌకర్యం కల్పించాలని, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణ బిల్లుల చెల్లించాలని..ఇత్యాది వాటిపై వినతులు అందజేశారు. ఎక్కువగా ఇంటి నిర్మాణ బిల్లుల చెల్లింపులపైనే వినతులు అందడంతో ఎమ్మెల్యే హౌసింగ్ అధికారులతో సమీక్షించారు. గ్రామానికి చెందిన ఒక యువకుడు అధికారులతో కుమ్మక్కై, అక్కడక్కడా పాత ఇళ్లకే పూర్తి స్థాయిలో బిల్లులు, అలాగే బేస్ మెంట్ స్థాయికే పూర్తి బిల్లులు చెల్లించారనే ఆరోపణలు రావడంతో ఎమ్మెల్యే అధికారులపై మండిపడ్డారు. ఇప్పటివరకు చేసిన ఇళ్ల నిర్మాణాలు, బిల్లుల చెల్లింపులపై తనకు 24 గంటల్లో నివేదిక ఇవ్వాలని, అలాగే హౌసింగ్ డీఈ విచారణ చేసి లబ్దిదారులకు న్యాయం చేయాలని ఆదేశించారు. విద్యుత్ సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుపాల్ యాదవ్, ఎంపీటీసీ ఉష, జెడ్పీటీసీ సభ్యురాలు మునెమ్మ, ఎంపీపీ మునిలక్ష్మి, నందకుమార్, వైస్ ఎంపీపీ దేరాల శ్రీనివాసులు, నాయకులు నందకుమార్, లాల్‌బాబు యాదవ్, ఎంపీటీసీలు మూర్తి సుబ్బన్న, సద్గుణ యాదవ్, పుత్తూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్, తహసీల్దార్ ద్వారకనాథ్ రెడ్డి, ఎంపీడీఓ రామచంద్ర, ఎంఈఓ లక్ష్మీపతి, ఎంపీటీసీలు, నాయకులు, సచివాలయ ఉద్యోగులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ

పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గంలో ఫిబ్రవరి 1 నుంచి 7వ తేదీ వరకు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ వలంటీర్లకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన పిచ్చాటూరు విలేకరులతో మాట్లాడారు. ప్రతి మండలంలోని సచివాలయ మండల, గ్రామ కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ వలంటీర్లను రెండు బ్యాచ్‌లుగా విభజిస్తారన్నారు. ప్రతి మండలంలో ఒక రోజు ఈ రెండు బ్యాచ్‌లకు శిక్షణ నిర్వహిస్తారన్నారు. ఫిబ్రవరి 1న బుచ్చినాయుడు కండ్రిగ, 2న గురువారం సత్యవేడు, 3న శుక్రవారం వరదయ్యపాళెం, 4న శనివారం ఉదయం నారాయణవనం, మధ్యాహ్నం పిచ్చాటూరు, 6న సోమవారం నాగలాపురం, 7న కేవీబీ పురం మండల కేంద్రాల్లో ఈ శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు వివరించారు.

ఎమ్మెల్సీగా పేర్నాటిని గెలిపించాలి



ఆర్.మల్లవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రేణిగుంట: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని వైఎస్సార్ సీపీ నాయకులు జలదంకి మదన్ మోహన్‌రెడ్డి కోరారు. మండలంలోని ఆర్.మల్లవరం, కృష్ణాపురం సచివాలయాల పరిధిలోని పట్టభద్రులను ఆయన కలిసి కరపత్ర ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పాలనను చూసి తమ అభ్యర్థిని గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, సర్పంచులు ఆవుల మునివెంకట్రామిరెడ్డి(బాబ్జి), ముద్దురాయులు, శేషారెడ్డి, మహదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణాలతో విద్యాబోధనే లక్ష్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న శివశంకరయ్య

శ్రీకాళహస్తి: నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యాబోధనే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని జిల్లా సమగ్ర శిక్ష అకడమిక్ మానటరింగ్ అధికారి శివశంకరయ్య అన్నారు. స్థానిక బహదూరుపేటలోని ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయుల విద్యాబోధనను పరిశీలించారు. అనంతరం విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాలకు ఇచ్చిన ఇంగ్లీష్ ల్యాబ్‌కు సంబంధించి కంటెంట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటమునిరెడ్డి, సీఆర్పీ లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీధి బాలలను సమాజహితులుగా మార్చండి



మాట్లాడుతున్న శ్రీకాళహస్తి డిపో మేనేజర్ రాజమోహన్‌రెడ్డి

శ్రీకాళహస్తి రూరల్: వీధి బాలలను సమాజ హితులుగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో మేనేజర్ రాజమోహన్‌రెడ్డి కోరారు. మంగళవారం వీధి బాలల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, సమాజంలో వీధి బాలలపై దృష్టి సారించి, వారిని సంస్కరించాల్సిన అవసరం ఉందన్నారు. వీరిని ప్రభుత్వాలు, సమాజం గుర్తించి, చేరదీసి, సంక్షేమ హాస్టళ్లలో చేర్చి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ రంగనాథ్, పారా లీగల్ వలంటీర్లు రాజేశ్వరరావు, గరికపాటి రమేష్‌బాబు, యాసిన్, వాసుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఏఈ సేవలు అభినందనీయం



సుధాకర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వరదయ్యపాళెం: హౌసింగ్ ఏఈ సుధాకర్ సేవలు అభినందనీయమని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్ రెడ్డి అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన సుధాకర్‌కు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, తహసీల్దారు గౌరీ శంకర్ రావు, ఇంజినీరింగ్ అధికారులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఆయన సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమం లో జెడ్పీటీసి వెంకటేశ్వర్లు, పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్ రెడ్డి, ఈఓపీఆర్డీ విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా సచివాలయ నిర్మాణం



చియ్యవరంలో నూతన సచివాలయం భవనం, పక్కనే నిర్మించిన రైతు భరోసా కేంద్రం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని చియ్యవరంలో రూ.40లక్షలతో నిర్మిస్తున్న రెండతస్తుల నూతన సచివాలయం పనులు దాదాపుగా పూర్తికావచ్చాయి. మేజర్ పంచాయతీ కావడంతో సచివాలయం పక్కనే రూ.20 లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మాణ పనులు కూడా పూర్తవడంతో రైతులకు ఇక్కడ ఎరువులు పంపిణీ చేస్తున్నారు. సచివాలయం ముందు స్థలంలో పూల మొక్కలు పెంచడానికి చర్యలు తీసుకుంటున్నారు.

పందుల బెడద



గ్రామంలో ఇళ్ల వద్ద ఉన్న పందులు

బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగలో పందులు బెడద మూలాన గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. చెత్తదిబ్బలు, హాస్టళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రుల వద్ద ఇవి ఎక్కువగా సంచరిస్తున్నాయి. ఇళ్లు, స్కూళ్లలోకి సైతం ప్రవేశిస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. వీటిని కట్టడి చేయాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇకనైనా వీటి బెడద లేకుండా చేయాలని కోరుతున్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

సత్యవేడు: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని తహసీల్దార్ టివి.సుబ్రమణ్యం అన్నారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని మదనంబేడు దళితవాడలో మంగళవారం రాత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్‌తోపాటు ఆర్ఐ రమాకాంత్ రావు మాట్లాడారు. ప్రజాస్వామ్య భారత దేశంలో మనుషులందరూ సమానమేనన్నారు. కార్యక్రమంలో పోలీసులు, వీఆర్ఓలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు పుడమికి మేలు

- రైతు సాధికార సంస్థ రాష్ట్ర కో-ఆర్డినేటర్ కర్నాటి ప్రభాకర్ రెడ్డి



మామిడిపూతలను పరిశీలిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

నారాయణవనం: ప్రకృతి వ్యవసాయంతో భూమిని కాపాడుతూ, ఆరోగ్యవంతమైన ఆహారాన్ని తీసుకునే అవకాశం ఉంటుందని రైతు సాధికార సంస్థ రాష్ట్ర కో-ఆర్డినేటర్ కర్నాటి ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం నారాయణవనం, వడమాలపేటలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఆయన పరిశీలించారు. మండలంలోని అరణ్యంకండ్రిగ ఆర్బీకేలో రైతులు, ప్రకృతి వ్యవసాయ రైతులతో మాట్లాడారు. పెరుగుతున్న జనాభాకు సరిపడా ఆహార ఉత్పత్తి కావడం లేదన్నారు. రసాయన ఎరువులను విచక్షణారహితంగా వినియోగించడంతో భూ క్షామం అయ్యే ప్రమాదం ఉందని అన్నారు. రసాయనరహిత ప్రకృతి వ్యవసాయంతో భూసారాన్ని శక్తివంతంగా మార్చి, అత్యధిక పోషకాలతో కూడిన దిగుబడులను పొందవచ్చునని చెప్పారు. సంపూర్ణ సేంద్రియ వ్యవసాయ పద్ధతులతో గోమూత్రం, గోపేడ నుంచి ఘన, ద్రవ జీవామృతాలతో విత్తనశుద్ధి, నవధాన్యాల పచ్చరొట్ట, వానపాములు, మిత్ర పురుగుల ద్వారా భూసారంతో పాటు కర్బనీకరణ పెరిగి వేపాకులు, స్థానిక వనరులతో ఘన, ద్రవ జీవామృతం, బీజామృతం, నీమాస్త్రం, అగ్నిస్త్రం, బ్రహ్మాస్త్రం, పంచగవ్యల సాగుతో నేలలో జీవ పదార్థం, భూసారం పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో భూమి, మానవాళి ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని రక్షిస్తుందన్న నినాదంతో రైతుల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మాత్రమే టీటీడీ కొనుగోలుకు ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. భవిష్యత్తులో మంచి డిమాండ్ ఉంటుందని అన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన

అంతకు ముందు మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి ప్రకృతి సాగు క్షేత్రాలను ఆయన సందర్శించారు. దశపర్ణి కషాయ పిచికారీతో ఏపుగా పూసిన పూతలతో నిండిన మామిడి తోటను పరిశీలించి, యాజమాన్య పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి సాగుకు అధికంగా వినియోగించే నల్లబెల్లంపై ఆంక్షలతో ఇబ్బందులు పడుతున్నామని సుదర్శనరెడ్డి అన్నారు. ప్రకృతి సాగు ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యంతో పాటు, సూక్ష్మ పోషకాలను 50 శాతం సబ్సిడీతో ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభాకర్‌రెడ్డితో పాటు సాధికార సంస్థ జిల్లా మేనేజర్ మునిరత్నం, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, అరణ్యంకండ్రిగ ఉపసర్పంచ్ మురళి, ప్రకృతి వ్యవసాయ ఇన్‌స్ట్రక్టర్లు మోహన్‌రాజు, మల్లికార్జున, నీలమ్మ, యూనిట్ ఇన్‌చార్జి భూపతి, క్షేత్ర స్థాయి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు ఉత్తమం



ముడియూరులో చిరుధాన్యాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న డీడీఏ వెంకటేశులు

పిచ్చాటూరు: చిరుధాన్యాలు సాగు చేయడం రైతులకు ఉత్తమమని డీడీఏ వెంకటేశులు అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవం పురస్కరించుకుని చిరుధాన్యాల సాగుపై మంగళవారం మండలంలోని ముడియూరు రైతుభరోసా కేంద్రంలో రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా డీడీఏ మాట్లాడారు. సజ్జ సాగు చేసిన రైతులకు హెక్టార్‌కు విత్తనశుద్ధి మందులతో పాటు ఇతర పురుగు మందులు ప్రభుత్వం ఉచితంగా ఇస్తోందన్నారు. ఒక ఎకరం వరి పండించే నీటితో నాలుగు ఎకరాలు చిరుధాన్యాలు పండించవచ్చన్నారు. సత్యవేడు ఏడీ రమేష్ రెడ్డి మాట్లాడుతూ మే, జూన్‌లో చిరుధాన్యాలు సాగు చేస్తే ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. చిరుధాన్యాల్లో పీచు పదార్థాలు ఎక్కువ ఉంటాయని, ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. అనంతరం పులిగుంట విద్యార్థులతో కలిసి చిరుధాన్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓలు సంజీవ రెడ్డి, శ్రీను, ఎంపీఏస్ వేణుగోపాల్, సుధ, కేవీకే శాస్త్రవేత్త దివ్య, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజనం' తనిఖీ



కంచనపుత్తూరులో విద్యార్థులతో కలసి భోంచేస్తున్న ఎంఈఓ రవీంద్రనాథ్



ఎంఈఓ రవీంద్రనాథ్‌ను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకంలో రుచికరమైన భోజనాన్ని పెట్టాలని మండల విద్యాశాఖాధికారి రవీంద్రనాథ్ ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని కంచనపుత్తూరు, పల్లమాల, కుక్కంబాకం గ్రామాల్లో ని ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మిక తనిఖీ చేసి, విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ, అన్ని స్కూళ్లలో మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఎంఈఓకు సన్మానం

గణతంత్ర దిన వేడుకల్లో ఉత్తమ మండల విద్యాశాఖ అధికారిగా ప్రశంసాపత్రం అందుకున్న రవీంద్రనాథ్‌ను మంగళవారం స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో ఎస్టీయూ మండల శాఖ ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో ఎస్టీయూ అధ్యక్షుడు రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శులు సురేష్, పట్టాభిరెడ్డి, సుధాకర్, శారదమ్మ, ధనుంజయ, చంద్రయ్య, జయప్రకాష్, కులశేఖర్, తదితరులు పాల్గొన్నారు. రైటప్

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షిస్తున్న ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి

రేణిగుంట: జగనన్న కాలనీల్లో పక్కా గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీపీ హరి ప్రసాద్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం హౌసింగ్‌పై ఆయన అధికారులతో సమీక్షించారు. గ్రామాల వారీగా జగనన్న ఇళ్ల నిర్మాణాల గురించి పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో తాగునీటి సదుపాయం, విద్యుత్, రోడ్లు వంటి మౌలిక వసతులను కల్పించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. లబ్ధిదారులు ఎవరైనా నిర్మించుకోలేని పరిస్థితిలో ఉన్నట్టు తెలియజేస్తే ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆయన ఆదేశాల మేరకు స్థానిక నాయకుల ద్వారా వారి ఇళ్లను నిర్మించేందుకు సహకరిస్తామన్నారు. సమావేశంలో ఎంపీడీఓ హరిబాబు, పీఆర్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

కుష్ఠుపై విద్యార్థులకు అవగాహన



కుష్ఠు వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని రామచంద్రాపురం గ్రామ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్.రాజేష్ కుష్ఠుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుష్ఠు వ్యాధి నిర్ధారణకు పరీక్షించడం, స్వీయ పరీక్షలు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. వ్యాధి అనుమానిత లక్షణాలు ఉన్న వారు ఆశా కార్యకర్త, ఏఎన్ఎం, యంఎల్‌హెచ్‌పీలకు తెలిపి సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఉచితంగా మందులు, వైద్యసాయం పొందాలని సూచించారు. ప్రభుత్వం ఖరీదైన మందులను కుష్ఠువ్యాధిగ్రస్తులకు ఉచితంగా ఇస్తోందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు, భారతి, ఏఎన్ఎం సుధ, ఆశా కార్యకర్త మంజుల పాల్గొన్నారు.

ఏకం ఆలయంలో భక్తుల సందడి



ఏకం ఆలయంలో భక్తులు

వరదయ్యపాళెం: మండలంలోని ఏకం ఆలయం ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం 20 వేల మంది భక్తులకు అమ్మ భగవాన్‌ను దర్శించుకున్నారు. ఏకం నిర్వాహకులు కృష్ణాజీ, ఆచార్య ఆనంద గిరీజీ, లోకేష్, ఉమాపతి, రుద్ర, సునీల్, శ్రీరామ్ దాసాజీ భక్తులకు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీసిటీ డీఎస్పీ జగదీష్ నాయక్, సీఐలు శివశంకర్ రెడ్డి, శ్రీనివాసులు, ఎస్ఐలు నాగార్జున రెడ్డి, రామాంజనేయులు సిబ్బందితో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సురక్షిత నీరు అందించడమే లక్ష్యం



సురక్షిత నీటిని అందిస్తున్న గున్నేరి కిషోర్‌రెడ్డి

ఏర్పేడు: ప్రతి కుటుంబానికీ సురక్షిత నీరు అందించడమే జల్ జీవన్ మిషన్ లక్ష్యమని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ గున్నేరి కిషోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కుక్కలగుంటలో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా సురక్షిత నీరు సరఫరా చేశారు. అనంతరం మొక్కలు నాటారు. గ్రామంలో మహిళలకు ముగ్గులపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ, సురక్షిత నీటిని అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జల్‌జీవన్ మిషన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయన్నారు. మంచి నీటి కుళాయిలేని కుటుంబాలను పంచాయతీ అధికారులు గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తిరుమలయ్య, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, సర్పంచ్‌లు కృష్ణయ్య, పెంచలయ్య, ప్రగతి సంస్థ డైరెక్టర్ వెంకటరమణ, ప్రతినిధులు శిరీష, ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● ఆశీస్సులు



శిల్పకళా వేదికలో శ్రీసిటీ జీఎం రామచంద్రారెడ్డి కుమార్తె వినీష దీపక్‌రాజ్ వివాహ రిసెప్షన్‌లో వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యేలు భూమన కరుణాకరరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కోనేటి ఆదిమూలం, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి తదితరులు. - తిరుచానూరు